# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 197

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 16 ఆగస్టు 2026








ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ ప్రతిభకు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మంచి వేదికగా నిలుస్తోందని భారత మహిళల మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ క్రికెటర్లకు లీగ్ ద్వారా తమ సత్తాను నిరూపించుకునే అవకాశం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు.

**సమయం ప్రతినిధి:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ACA) ప్రారంభించిన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ యువ, ఔత్సాహిక క్రికెటర్లకు అత్యున్నత స్థాయి అవకాశాలు అందించి వారి ప్రతిభను వెలుగులోకి తీసుకువస్తోందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారని, వాళ్లకు సరైన గుర్తింపు కావాలని మిథాలీ అన్నారు. జిల్లాల్లో ఉండి క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉన్న పిల్లలకు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ద్వారా మంచి అవకాశం లభిస్తోందన్నారు. మహిళా క్రికెట్‌కు ఏసీఏ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళా ప్రీమియర్ లీగ్ ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతోందని ప్రశంసించారు. స్థానిక ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదిక కల్పించడం ద్వారా భవిష్యత్తులో మరింత మంది ఆంధ్రప్రదేశ్ క్రికెటర్లు జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉందని మిథాలీ రాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే స్నేహ దీప్తి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు (ACA Mithali Raj APL). ఆంధ్ర ప్రీమియర్ లీగ్ కేవలం పోటీలు నిర్వహించే వేదికగా కాకుండా, యువ క్రికెటర్ల ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే వ్యవస్థగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం గీతాలాపనపై రాజకీయ వివాదం చెలరేగింది. వందేమాత్రం పూర్తి గీతాన్ని ఆలపించడాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. అయితే కాంగ్రెస్ ఆ ఆరోపణను తీవ్రంగా ఖండించింది.

**సమయం ప్రతినిధి:** వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పరస్పరం మాట్లాడుకుంటూ, కార్యక్రమ నిర్వాహకులకు ఆపమని సంకేతాలు ఇచ్చారని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ఆరోపించారు. వందేమాతరం తొలి భాగాలు పూర్తయిన తర్వాత సోనియా గాంధీ అసహనంగా కనిపించారని, గీతాన్ని అక్కడితో ఆపాలని ఆమె సూచించినట్లు తమకు కనిపించిందని బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ సోషల్ మీడియా ద్వారా విమర్శించారు. బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. సోనియా గాంధీ వందేమాతరం గీతాన్ని ఆపాలని ఎలాంటి సూచనా చేయలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కార్యక్రమంలో చాలాసేపు నిల్చున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కుర్చీ ఏర్పాటు చేయాలని మాత్రమే సోనియా గాంధీ సూచించారని తెలిపింది. వందేమాతరం పూర్తి రూపంలోనే కాంగ్రెస్ కార్యాలయంలో ఆలపించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. వందేమాతరంను పూర్తిగా ఆలపించడంపై కేంద్రం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా అవమానించడాన్ని నేరంగా పరిగణించేలా చట్టపరమైన మార్పులు కూడా జరిగాయి.

## రేషన్ కార్డు కేవలం కాగితం కాదు..

# పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం





**సంగారెడ్డి, ఆగస్టు 15:** స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అయితే పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని అన్నారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500/- బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గత 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి సంబంధించి రూ.90 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని చెప్పారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం మొత్తం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా తమ ప్రభుత్వం రెండేళ్లలో సుమారు 7 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం తెలంగాణలో ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందిస్తామని చెప్పారు. రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి కొనసాగాలని కోరారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీతో జగ్గారెడ్డికి ఉన్న అనుబంధాన్ని రాముడు-హనుమంతుడి సంబంధంతో పోల్చారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడు ప్రజా జీవితంలో ఉండాల్సిన అవసరం ఉందని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

## చిట్టెం నర్సిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**ధన్వాడ: (సమయం ప్రతినిధి) :** దివంగత మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ చిట్టెం నర్సిరెడ్డి వర్ధంతి సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ఎంపీ డీకే అరుణ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం చిట్టెం నర్సిరెడ్డి ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నర్సిరెడ్డి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ప్రజా జీవితంలో ఆయన చేసిన సేవలను, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. నక్సలైట్ల కాల్పుల్లో తన తండ్రిని కోల్పోవడం తమ కుటుంబంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. 2005 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సమయంలో నర్సిరెడ్డి నక్సలైట్ల కాల్పుల్లో హత్యకు గురయ్యారు. మక్తల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా ప్రజాసేవ చేసిన ఆయన విద్య, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి విశేష కృషి చేశారని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేశారు. కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్: (సమయం ప్రతినిధి) :** తెలంగాణ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్ సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి, మాజీ మంత్రులు మెహమూద్ అలీ, నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, బీఆర్ఎస్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆగస్టు 17 నుంచి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి



**మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి):** ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహిస్తున్నందున సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని కలెక్టర్ కోరారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ ఖుష్బూ గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందికి ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం లభించేందుకు సమరయోధులు చేసిన త్యాగాలు, పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులకు స్వాతంత్ర్య పోరాట చరిత్ర, సమరయోధుల త్యాగాలు, దేశానికి స్వాతంత్ర్యం ఎలా లభించింది, రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కుల గురించి వివరించాలని సూచించారు. ప్రస్తుతం పిల్లలు ఇంటర్నెట్, విద్య, వైద్యం తదితర అనేక సౌకర్యాలను అనుభవిస్తున్నారని, ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయో వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాల గురించి కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా పిల్లలతో చర్చించడం ద్వారా వారిలో దేశభక్తి, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను పెంపొందించవచ్చని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి ఒక్కరికీ గర్వకారణమైన, స్ఫూర్తిదాయకమైన పర్వదినమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు




**అమరావతి:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని గ్రామాల్లో ప్రభుత్వ శకటాల ప్రదర్శన సందడి నెలకొంది. అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో ఇవాళ (శనివారం) పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను వేడుకల్లో ప్రదర్శించారు. అయితే, ఈ కార్యక్రమం అనంతరం శకటాలను రాజధాని ప్రాంత గ్రామాల్లో ప్రదర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి మల్కాపురం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా శకటాల ప్రదర్శన కొనసాగింది. రంగురంగుల అలంకరణలతో రూపొందించిన శకటాలు గ్రామాల మీదుగా సాగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వీటి ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

# సంపాదకీయం

## పర్యావరణ చట్టానికి తూట్లు

చట్టాలలో ప్రజాప్రయోజన చట్టాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. వాటికి ఒక సామాజిక కోణం ఉంటుంది. అలాగే ఆ చట్టాన్ని ఉదారంగా నిర్వచించాల్సి వస్తుంది. అయితే ఆ ఉదారత ఆ చట్టం ఎవరి కోసం అయితే నిర్దేశించిందో వారికి అనుకూలంగా ఉండాలి కానీ, ఆ చట్టాన్నే నిర్వీర్యం చేసేటట్టు ఉండకూడదు. సుప్రీంకోర్టు జూలై 29న వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు ఒక ప్రజాప్రయోజనార్థ చట్టాన్ని ఆ చట్టం ఉద్దేశాలకు, మౌలిక స్వభావానికి భిన్నంగా నిర్వచించింది. ఆ చట్టం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986. పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1994లో పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వును విడుదల చేశారు. అందులోని షెడ్యూల్‌లో 'ఏ ప్రాజెక్టు కొత్తగా మొదలుపెట్టాలన్నా, ఉన్న ప్రాజెక్టును విస్తరించాలన్నా పర్యావరణ అనుమతి లేకుండా చేయడం కుదరదు' అని ఉంది. 2006లో తెచ్చిన కొత్త ఉత్తర్వులోనూ చాలా స్పష్టంగా– ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని ఉంది. అంటే 1994లో అంతర్లీనంగా ఉన్నది, 2006 నాటికి ప్రస్ఫుటంగా ఉంది. అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిలో బలమైన పెట్టుబడిదారులు ఉన్నారు. వారు ఎటువంటి పర్యావరణ అనుమతి లేకుండా తమ ప్రాజెక్టులను నిర్మించడమేగాక, కొందరైతే నిర్మాణం పూర్తిచేసి ఆ పరిశ్రమలను నడిపేస్తున్నారు కూడా. అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేసిన వారికి ఊరటగా కేంద్ర పర్యావరణ శాఖ 1994 నుంచి సడలింపు ఇస్తూ వచ్చింది. ఆ సడలింపు ప్రకారం, 'నిర్మాణం మొదలుపెట్టేశాక, లేదా పూర్తి చేసేశాక కూడా పర్యావరణ అనుమతి తీసుకోవచ్చు!' దీనిని 'ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో' అనుమతి అంటారు. అటువంటి సడలింపులు చట్ట విరుద్ధమనీ, అలా చేయడానికి ఏ మాత్రం కుదరదనీ 2004 నుంచి సుప్రీంకోర్టు పలుమార్లు చాలా స్పష్టంగా చెబుతూ వచ్చింది. అయినా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన మంత్రిత్వశాఖ 2017లో అటువంటి సడలింపు ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ చట్టం కింద మరొక్కసారి ఇచ్చింది. 2017 మార్చి 14 నాటికి అనుమతి లేకుండా నిర్మిస్తున్న లేదా నిర్మించినవారు తదుపరి ఆరు నెలల్లో అనుమతి తెచ్చుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ ఆరు నెలలు కాస్తా 13 నెలలు అయ్యింది. అనుమతి లేకుండా ఇలా నిర్మించిన పరిశ్రమల్లో పర్యావరణ విధ్వంసకరమైనవి ఉంటాయి, ఈ పాటికే అవి చాలా నష్టం చేసి ఉంటాయి అనే సందేహం ఈ ఉత్తర్వు ఇచ్చినవారికి కలిగినట్టు మనకు అనిపించదు. అంతేగాక 'ఈ ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ కోసం ఇస్తున్నాం' అని రాసుకొచ్చారు! ఇది కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే అని కూడా చెప్పారు. ప్రతిసారి ఈ ఒక్కసారికే అని చెప్పటం ఈ పాటికి పరిపాటి అయ్యింది. మళ్లీ 2021లో ఒక ఆఫీస్ మెమోరాండం ఇచ్చారు. దాని ప్రకారం... అనుమతి లేకుండా మొదలుపెట్టినవారు ఏ భయం లేకుండా ఇప్పుడు అనుమతులు తీసుకోవచ్చు అని. ఇది చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వు కాదు. అలాగే 2017 నాటి ఉత్తర్వులో లాగా ఇది ఒకసారికి మాత్రమే అని కూడా లేదు. అంటే, ఒక రకంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియకే చమరగీతం పాడిన మెమోరాండం ఇది. ఈ రెండిటినీ ముందుగా మద్రాస్ హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునళ్లలో ఛాలెంజ్ చేశారు. హైకోర్టు, ట్రిబ్యునల్ దాటుకుని ఈ వన శక్తి కేసు సుప్రీంకోర్టు వరకూ వచ్చింది. మే 14, 2025న సుప్రీంకోర్టు ధర్మాసనం దీని గురించి ఒక అద్భుతమైన తీర్పు ఇచ్చింది–ఇటువంటి ఉత్తర్వులు, మెమోరాండంలు ఇవ్వడమంటే పక్కదారిలో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని నీరుగార్చడమే అని, చట్టం ఉద్దేశం పరిరక్షణ అయితే విధ్వంసకర ప్రాజెక్టులకు పరిరక్షణ చట్టం కింద సడలింపు ఇవ్వడం ఎలా కుదురుతుందని తెలిపింది. అంతేగాక, సుప్రీంకోర్టు ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు 'ఇటువంటి సడలింపులు కుదరవు' అని చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ పర్యావరణ, న్యాయ సిద్ధాంత మేళవింపుగా తీర్పు ఇచ్చింది. 2017 నాటి ఉత్తర్వుని, 2021 నాటి మెమోరాండంను కొట్టివేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఉత్తర్వులు లేదా మెమోరాండంలు ఇవ్వడానికి వీలులేదని కూడా చాలా స్పష్టంగా తెలియజేసింది. ఈ తీర్పు మీద రియల్ ఎస్టేట్ లాబీ సంస్థ క్రెడాయ్ సమీక్ష కోరింది. ఇక్కడ గమనించాల్సింది ఈ కేసులో ప్రధాన పార్టీ అయిన కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పును ఒప్పకుంది. వారు కోరని సమీక్ష క్రెడాయ్ కోరింది. సమీక్ష తీర్పును ముగ్గురు సభ్యుల ధర్మాసనం వెలువరించింది. ఇద్దరు న్యాయమూర్తులు ఈ కేసును మళ్లీ వినాలి అని తీర్మానించగా, ఒక న్యాయమూర్తి మాత్రం ఇచ్చిన తీర్పు సరైనదే అని నవంబర్ 18, 2025న తీర్పు చెప్పారు. దానితో ఈ కేసు మళ్లీ ముగ్గురు సభ్యుల ధర్మాసనం దగ్గరికి వెళ్లింది. ఈ ధర్మాసనం జూలై 29న తన మలి తీర్పు ప్రకటించింది. ఈ మలి తీర్పులో మొదటి తీర్పులో చెప్పినట్టుగా ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో అనుమతులకు చట్టంలో స్థానం లేదు అని స్పష్టం చేశారు. ఆఫీస్ మెమోరాండంను కూడా కొట్టివేశారు. అంతవరకే చేసి ఉంటే మొదటి తీర్పును ఎత్తిచూపుతూ, పర్యావరణ పరిరక్షణ చట్టం ఉద్దేశాలకూ, మౌలిక స్వభావానికి అనుగుణంగా ఉండేది. అయితే దానితో పాటు ముందస్తు అనుమతి నుంచి కొన్ని పరిస్థితులలో సడలింపు ఇవ్వవచ్చు అని రాసుకొచ్చారు. దానికి ఒక ప్రాతిపదిక కూడా ఇచ్చారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నప్పుడు అలా కాకుండా మరో విధంగా చేయడానికి వీలులేదు అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పి నాలుగు దశాబ్దాలు అవుతుంది. అది పర్యావరణ అనుమతి అయినా మరొకటి అయినా. అయితే పర్యావరణ అనుమతి విషయంలో అది మరింత ముఖ్యం. ఎందుకంటే ఒకసారి విధ్వంసం జరిగాక దానిని తిరిగి మునుపటి స్థితికి తీసుకురావటం అసంభవం కాబట్టి. అందులోనూ వాతావరణ మార్పు ప్రధానంగా ఉన్న ఈ కాలంలో ఆ జాగరూకత, జాగ్రత్త మరింత అవసరం. అయినా కూడా చట్టంలో లేని, అలా కుదరదు అని రాజ్యాంగ ధర్మాసనం చెప్పినా కూడా 'ప్రజా ప్రయోజనం' పేరు మీద ఒక ప్రాతిపదిక ఏర్పాటు చేయడం అవాంఛనీయం. అంతే కాక, 1994 లేదా 2006 నాటి ఉత్తర్వు చట్టంలోని పర్యావరణ పరిరక్షణ సూత్రం కింద తీసుకువచ్చిన ఉత్తర్వు. ఇప్పుడు అదే సూత్రం కింద అదే ఉత్తర్వును నీరుగారుస్తూ... మరొక ఉత్తర్వు ఇవ్వడంలో అసంబద్ధత లేదు అని చెప్పడం ఏ మాత్రం ఆమోదయోగ్యం? భారతదేశంలో పర్యావరణ చట్ట సిద్ధాంతాన్ని పార్లమెంట్ కన్నా కూడా సుప్రీంకోర్టే అభివృద్ధి చేసిందని చెప్పడం అతిశయోక్తి కాదు. 1990ల్లో ఇచ్చిన పలు తీర్పుల ద్వారా పర్యావరణ సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలను సుప్రీంకోర్టే క్రోడీకరించి, జీవించే హక్కులో భాగం చేసింది. ఒకప్పుడు గురుతర బాధ్యతను పోషించిన కోర్టే ఈ రోజు దానికి విరుద్ధంగా కాకపోయినా భిన్నంగా ప్రవర్తించడం బాధాకరం, ప్రమాదకరం కూడా.

# నల్లగొండ నా ఊపిరి... శ్వాస ఉన్నంతవరకు ప్రజల కోసమే పనిచేస్తా





సమయం ప్రతినిధి, నల్లగొండ : "నల్లగొండ అంటే పోరాటం, త్యాగం, తిరుగుబాటు మరియు ఆత్మగౌరవానికి ప్రతీక. నల్లగొండ జిల్లానే నా ఊపిరి.. నా చివరి శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల సంక్షేమం, ప్రాంతాభివృద్ధి కోసమే పాటుపడతా" అని రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారం ఏనాటికీ శాశ్వతం కాదని, ప్రజల కోసం చేసిన పోరాటాలే చరిత్రలో నిలిచిపోతాయని ఆయన పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాను పోరాటాల గడ్డ స్థాయి నుంచి రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. నల్లగొండ పట్టణంలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రూ. 83 కోట్లతో చేపట్టిన 24 గంటల సురక్షిత తాగునీటి ప్రాజెక్టు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణాభివృద్ధి కోసం అదనంగా మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్లగొండను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ. 20 కోట్లతో ఎన్–ఏ–సి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా, పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించడానికి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ జిల్లా బిడ్డగా మీకు మాట ఇస్తున్నా.. జిల్లాలో తాగునీరు, సాగునీటి కష్టాలను పూర్తిగా తీర్చి, నల్లగొండను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడతానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహనీయుల త్యాగాలే మనకు స్ఫూర్తి : షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్నగర్ : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే వారికి అందించే ఘనమైన నివాళి అని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పటేల్ రోడ్డులో కాంగ్రెస్ నాయకులు మన్నే రవి, నీరటి వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ పతాకానికి వందనం చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వేచ్ఛా భారతం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడంతోపాటు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత దేశ భవిష్యత్‌ను నిర్దేశించే శక్తిగా ఎదిగి, సమాజ అభ్యున్నతిలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే కార్యక్రమం మాత్రమే కాదని, దేశం పట్ల ప్రతి పౌరుడి బాధ్యతను గుర్తుచేసే సందర్భమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, పరస్పర ఐక్యతతో ముందుకు సాగినప్పుడే దేశం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అగ్గనూరు విశ్వం, కొంకళ్ళ చెన్నయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, షర్ఫుద్దీన్, మనీష్, ముద్దీన్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, యువత, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవం

అమరచింత : అమరచింత మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి యందు ఉన్న ఛత్రపతి శివాజీ స్వామి వివేకానంద ట్రై రస్తా దగ్గర ఉన్న స్వామి వివేకానంద ఫ్లెక్సి కట్ట దగ్గర వివేకానంద యూత్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు వినోద్ కుమార్ ఆటో యూనియన్, హమాలీ యూనియన్, వివిధ రకాల వృతి దారులు వ్యాపారస్థులు,రాజకీయ పార్టీల నేతలతో విద్యార్థి సంఘాల నాయకులతో క్రికెట్ క్రీడాకారులతో భారత మాత జాతీయ నాయకుల చిత్రపటాలకు పూల మాలలతో పూజా కార్యక్రమంను మరియు విద్యార్థి సంఘం నాయకులు మహంకాళి రాజేష్ జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు దేవర్ల సురేష్ భీమసేన్ ఆనంద్ తోకలి గణేష్ మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవు తున్న చారిత్రక నేపథ్యంలో అందరికీ 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ రోజు మనం ఎంతో గర్వంగా త్రివర్ణ పతాకానీ ఎగురవేస్తున్నామంటే దానికి కారణం ఎందరో మహనీయుల త్యాగం ఉందని, వారి త్యాగాల వల్ల మనకు స్వేచ్ఛ లభించిందనీ కాబట్టి స్వాతంత్రం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు మన దేశం పట్ల, సమాజం పట్ల, మన భవిష్యత్ తరాల పట్ల బాధ్యత అని ప్రతి ఒక్కరు గ్రహించాలని తెలుపుతూ ఈ రోజు మన దేశం విజ్ఞానం, సాంకేతిక ,వ్యవసాయం, రక్షణ అంతరిక్ష మరియు అనేక రంగాల్లో ప్రపంచ స్థాయిలో ముందుకు సాగుతుందనీ ఈ అభివృధినీ మరింత వేగవంతం చేయాల్సిన బాధ్యత మనందరిదనీ, ప్రత్యేకంగా యువత దేశానికి వెన్నెముక యువతలో నైపుణ్యం, క్రమశిక్షణ, దేశభక్తి ,నిజాయితీ ఉంటే భారత దేశం మరింత శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందనీ, మన దేశం అభివృద్ధి చెందాలంటే మనం కొన్ని విషయాలు కచ్చితంగా పాటించాలనీ చట్టాన్నీగౌరవించడం ,పర్యావరణాన్ని పరిరక్షించడం, అవినీతికి దూరంగా ఉండడం ,మహిళలను గౌరవించడం, విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు మనలో భిన్నత్వం ఉన్నప్పటికీ మనమంతా ఒకే దేశానికి చెందిన వాళ్ళమని భావించడం, మతాలు వేరైనా, భాషలు వేరైనా, ప్రాంతాలు వేరైనా మన జాతీయత ఒక్కటే ,మన దేశం ఒకటే, మన జెండా ఒక్కటే అనే భావనను ప్రతి ఒక్కరు హృదయంలో నింపుకొని దేశ రక్షణకు పాటుపడడం ముఖ్యమని తెలుపుతూ నా దేశం అభివృద్ధి చెందడానికి నేను నా వంతు కృషి చేస్తాను అని, నా దేశ గౌరవాన్ని కాపాడుతాను అని, దేశ సమాజానికి ఉపయోగపడే పౌరుడుగా జీవిస్తాను అని భారతదేశాన్ని మరింత గొప్ప దేశంగా తీర్చిదిద్దడంలో నా వంతు కృషి చేస్తాను అని ప్రతి ఒక్కరూ తమ మనసులో ప్రతిజ్ఞ నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం అమరచింత ప్రధాన రహదారి గుండా జాతీయ జెండాలతో జెండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం కుమ్మరి శ్రీను, శివయ్య, రఘురామ్ ,పాండు ,వెంకటేష్ రవి,వంశీ , ప్రశాంత్, రవివర్మ , దోమ సందీప్,చంద్రు, ఉదయ్ ,నిజగుణ బాలు రవిచంద్ర తోకలి రవి ఓగ్గు వెంకటేష్ నవీన్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సహకరిస్తే మరిన్ని ఆవిష్కరణలకు శ్రీకారం: జాతీయ చేనేత అవార్డు గ్రహీత శ్రీరామ్

అమరచింత : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరచింత చేనేత సహకార సంఘం కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చేనేత సహకార సంఘం అధ్యక్షులు తిరుమల రఘురాం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పద్మశాలి పెద్దలు, మాజీ చేనేత అవార్డు గ్రహీత దేవరకొండ లచ్చున్న , మహిళా డైరెక్టర్, మాజీ చేనేత అవార్డు గ్రహీత మహంకాళి సులోచనమ్మ గాంధీజీ, భారతమాత, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం ఇటీవల రాష్ట్ర చేనేత అవార్డు అందుకున్న మహంకాళి ఎల్లప్ప, వారి సతీమణిని, అలాగే జాతీయ స్థాయిలో చేనేత రంగంలో నిర్వహించిన హ్యాకథాన్ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన వగ్గు లిశ్రీరామ్‌లిని నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వగ్గు శ్రీరామ్ మాట్లాడుతూ, తాను చిన్ననాటి నుంచే చేనేత కుటుంబంలో, చేనేత కార్మికుల మధ్య పెరిగానని, తన తల్లిదండ్రులు, ఇతర చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూసి ఒక ఆలోచనతో నూతన యంత్రాన్ని రూపొందించానని తెలిపారు. తాను రూపొందించిన ఈ ఆవిష్కరణ దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 35 లక్షల మంది చేనేత కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉంటుందని పేర్కొన్నారు. తన ఆవిష్కరణను కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారని శ్రీరామ్ తెలిపారు. చేనేత సహకార సంఘం ఎల్లప్పుడూ తనకు సహకారం అందిస్తే, భవిష్యత్తులో చేనేత రంగానికి ఉపయోగపడే మరిన్ని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడతానని అన్నారు. అనంతరం చేనేత సహకార సంఘం ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ నూరుల్ లినజీబ్‌లిని నూతన పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా కమిషనర్ గారు చేనేత కార్మికులకు అందుతున్న పెన్షన్‌కు సంబంధించిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. చివరగా చేనేత సహకార సంఘం అధ్యక్షులు తిరుమల రఘురాం మాట్లాడుతూ, చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు, పెన్షన్లకు సంబంధించిన అంశాల్లో సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చేనేత సహకార సంఘం భవన నిర్మాణం విషయంలో త్వరలో పంజాబ్ చండీగఢ్ రాష్ట్రాల మంత్రిలి శ్రీనివాస్‌లిని చండీగఢ్‌లో ప్రత్యేకంగా కలిసి సమస్యను వివరించి భవన నిర్మాణానికి సహకారం కోరుతామని తెలిపారు. అలాగే లిమహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ సహకారంతో చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని రకాల సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, చేనేత రంగ అభివృద్ధికి ఆమె సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు.



# పేదల మేలు కోసమే నాణ్యమైన సన్న బియ్యం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే





(సమయం ప్రతినిధి భూపాలపల్లి) : నాణ్యమైన సన్నబియ్యంతో పేదలకు మేలు జరుగుతుంది అని అన్నారు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా కోటికి పైగా రేషన్ కార్డులను డిజిటలైజ్ చేసి, అనేక భద్రతా ప్రమాణాలతో కూడిన ప్లాస్టిక్ కార్డుల రూపంలో ప్రజలకు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చామని, గతంలో కరువు, వలసలతో ఇబ్బందులు పడిన పేద కుటుంబాలు నేడు నాణ్యమైన సన్నబియ్యం తినే స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం సమర్థవంతమైన పరిపాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, దీని ద్వారా లక్షలాది మంది మహిళలు ధైర్యంగా బయటకు వచ్చి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. విద్య కోసం మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే విద్యార్థినులకు కూడా ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుని చదువుకొని రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన మారుమూల తండాకు చెందిన విద్యార్థిని ఉదాహరణను ఆయన గుర్తుచేశారు. గతంలో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోకుండా విక్రయించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం అందిస్తుండటంతో లబ్ధిదారులు బియ్యాన్ని ఇంటికి తీసుకెళ్లి నేరుగా వినియోగిస్తున్నారని తెలిపారు. విద్యారంగంలోనూ ప్రభుత్వం అనేక కీలక మార్పులు తీసుకొస్తోందని ప్రభుత్వ విప్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందిస్తోందని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యేవారని విమర్శించిన ఆయన, ప్రస్తుతం ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోబోతోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నవంబర్ నుంచి రేషన్ కార్డు హోల్డర్లందరికీ రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు, మహిళా సంఘాలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ రైస్ మిల్లుల నిర్వహణను మహిళా సంఘాల ద్వారా చేపట్టడంతో పాటు గిడ్డంగుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు చేపడతామని అన్నారు. పేదల కడుపు నింపే ఈ ప్రభుత్వ "చెయ్యి"ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లికి అభివృద్ధి వరాలు.. సంక్షేమానికి పెద్దపీట : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే




(సమయం ప్రతినిధి భూపాలపల్లి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. దేశ స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని, వారి త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తెలంగాణను ప్రపంచ వేదికపై అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తోందన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని, 223 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 53,763 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4,586 ఇళ్లు మంజూరు కాగా 797 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. రైతు సంక్షేమంలో భాగంగా 29,683 మంది రైతులకు రూ.299.34 కోట్ల రుణమాఫీ, 1,27,151 మంది రైతులకు రూ.144.93 కోట్ల రైతు భరోసా అందించినట్లు తెలిపారు. 21,806 మంది రైతుల నుంచి 12.58 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రూ.298.21 కోట్లకు పైగా చెల్లించినట్లు వెల్లడించారు.

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 2.19 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా రూ.118.04 కోట్ల మేర ఆదా అయిందన్నారు. రూ.500 గ్యాస్ పథకం, ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గృహజ్యోతి కింద 58,298 కుటుంబాలకు 15.41 లక్షల జీరో బిల్లులు జారీ చేసి రూ.50.86 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, 13,745 మొక్కలు నాటినట్లు చెప్పారు. ఆరోగ్య రంగంలో 65 పల్లె దవాఖానాలు, జిల్లా ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, వెంటిలేటర్ వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. "మనసు ఉంటే మార్గం ఉంటుంది" అనే నమ్మకంతో ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూపాలపల్లి వంటి మారుమూల జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మహిళా సంఘాల సమాఖ్యకు రూ.91.56 కోట్ల చెక్కును అందజేశారు. ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించి, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.





## దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : గుండా మనోహర్



(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ పతాకానికి అభివాదం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో ప్రాణత్యాగం చేశారని వారి ఆశయాలను ఆచరణలో పెట్టి దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, షేక్ ఫరూఖ్ హుస్సేన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి): 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ తరఫున ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు అందుకున్న కార్యాలయ ఏ.డి. అనురాధ, సీఎంవో సుధాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవిశంకర్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయకుమారి అభినందించారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఇదే స్ఫూర్తితో మరింత నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

## ఉత్తమ సేవలకు సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు ప్రశంసాపత్రం



మహబూబ్‌నగర్: (సమయం ప్రతినిధి) : జర్నలిస్టులకు సేవలందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా డీపీఆర్ఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జి. కృష్ణయ్యకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రశంసాపత్రం అందజేశారు. జర్నలిస్టులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, వారి విధుల నిర్వహణకు సహకరిస్తున్న కృష్ణయ్య సేవలను కలెక్టర్ అభినందించారు.




# మహబూబ్‌నగర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయం పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) , జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు జాతీయ జెండాకు అభివందనం చేసి, జాతీయ గీతాన్ని ఆలపించి, పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను తిలకించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారులు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు వివరించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను వీక్షించారు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖల సేవలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన పోలీసు పరేడ్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తదనంతరం మంత్రి జూపల్లి కృష్ణా రావు ఎమ్మెల్యే . జి. మధుసూదన్ రెడ్డి (GMR) , జిల్లా కలెక్టర్ , ఎస్పీ.. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలను అందజేశారు.







## గద్వాల జిల్లా సర్వతో ముఖాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి




గద్వాల : జోగులంబ గద్వాల్ జిల్లా లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జెండా ఆవిష్కరించి,గౌరవ వందనం స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపి జితేందర్ రెడ్డి (ఢిల్లీ ప్రత్యేక అధికార ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వం మరియు సలహాదారు క్రీడా వ్యవహారాలు) పాల్గొని జాతీయ జెండాను ఏగురవేసారు... 'తెలంగాణ రైసింగ్ – 2047 విజన్' తో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం.గద్వాల్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అందరం కంకణబద్ధులం కావాలని వక్తలు పిలుపునిచ్చారు.ప్రగతి బాటలో అందరం కలిసికట్టుగా నడవాలి.పరేడ్ మైదానం ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఏపి జితేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు.కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కృష్ణమోహన్ రెడ్డి ,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు,జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ,జిల్లా పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఏపి జితేందర్ రెడ్డి గారు ఈ సందర్భంగా ప్రసంగిస్తూ –భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలోనే కాకుండా, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైసింగ్ – 2047 విజన్' ఆధారంగా అభివృద్ధి పథంలో దృఢంగా ముందుకు సాగుతోంది.ఈ విజన్‌లో పేదల సంక్షేమం, సమగ్ర ప్రజా పాలసీలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక సుపరిపాలన – ఈ నాలుగు ప్రధాన లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆడబిడ్డల సాధికారత, రైతులకు రుణమాఫీ, నిరుపేదలకు సన్నబియ్యం, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం, యువతకు ఉపాధి అవకాశాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, హైదరాబాద్‌కు అంతర్జాతీయ హంగులు – ఇవన్నీ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కీలక కార్యక్రమాలు. గద్వాల్ జిల్లా సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులం కావాలి.అభివృద్ధి కొనసాగడానికి శాంతి భద్రతలు అత్యంత అవసరం. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులు, మరియు ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను." రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరులకు ఘన నివాళులు అర్పించారు. చివరిగా ఏపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ 'జిల్లా ప్రగతికి అందరం పునరంకితమై, రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్దాం" అంటూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, పాత్రికేయులు మరియు జిల్లా ప్రజలు పాల్గొన్నారు.

## బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో స్వాతంత్ర వేడుకలు

### జాతీయపతాకం ఎగురవేసిన జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్.



వనపర్తి : భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయపతాకాన్ని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ ఎగురవేసి ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్, నందిమల్ల.అశోక్,కె.మాణిక్యం,రఘుపతి రెడ్డి,గంధం.బాలపీరు, గంధం.పరంజ్యోతి, జాత్రు నాయక్,గులాం ఖాదర్ ఖాన్,ఉంగ్లం. తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, జింకల.హరిబాబు, జోహెబ్ హుస్సేన్,నాగన్న యాదవ్, స్టార్.రహీమ్, మహేశ్వర్ రెడ్డి, ఇమ్రాన్, నీలస్వామి,శిరీవాటి.శంకర్ తదితరులు ఉన్నారు.

## పంద్రాగస్టు రోజే కల్లు అమ్మకాలు.. ఆత్మకూర్‌లో డ్రై డేకు తూట్లు!

### కళ్ల ముందే కల్లు విక్రయాలు.. ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ ఏం చేస్తున్నారు?

### డ్రై డే నాడు దర్జాగా అమ్మకాలు.. ఆత్మకూర్ ఎక్సైజ్‌పై ప్రశ్నలు!



వనపర్తి : ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రం, ఖానాపూర్ లో పంద్రాగస్టు రోజే కల్లు విక్రయాలు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వెలుగులోకి వచ్చాయి. డ్రై డే నాడు విక్రయాలు జరుగుతుంటే స్థానిక ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ పర్యవేక్షణ ఎక్కడ అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి కల్లు విక్రయిస్తున్న వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు, అధికారుల బాధ్యతపైనా ఉన్నతస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సమానత్వం, సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి






నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ చంద్ర, ఎఫ్.డి.ఓ చంద్ర ప్రకాష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.చేన్నయ్య, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దేవ సహాయం, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అతిథి తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు.తెలంగాణ రాష్ట్ర ఏ ఆశయంతో అయితే ఏర్పడిందో ఆ దిశగా మనందరం అందరి ఆశల మేరకు కృషి చేసి స్వేచ్ఛ, సామాజిక న్యాయం పాటించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూనే, ఈ రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా సమస్త ప్రజానికానికి పంపిణి జరగాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పురోగమిస్తూ, సకల జనుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రం ఏ ఆశయంతో ఏర్పడిందో, ఆ ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం అనే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణలో సృష్టిస్తున్న సంపద సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికన అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకోవాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి పనిచేస్తోందని, ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.రాష్ట్ర అభివృద్ధితో పాటు సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడం, పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, రైతులు, యువతకు అండగా నిలవడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్ర ప్రగతి మరింత వేగవంతమవుతుందని, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం విలువలను కాపాడుతూ తెలంగాణను మరింత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం స్వాతంత్ర సమర యోధులు స్వర్గీయ సినిమా శఖరయ్య సతీమణి అంబటి లీలావతిని ఈ సందర్భంగా శాలువా తో సత్కరించారు. నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ద్వారా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడూర్ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలో స్వాగతం సుస్వాగతం, స్వతంత్ర భారత దేశ్ అని గీతాలపనకు స్వతంత్ర సమరయోధుల ను కళా రూపంలో ఆవిష్కరించిన విద్యార్థులు, ఆహుతుల హృదయాలను కదిలించేలా భారత స్వతంత్రోత్సవాన్ని కళాత్మకంగా ప్రదర్శించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడూరు విద్యార్థుల కళాత్మక ప్రదర్శనకు మొదటి బహుమతి లభించింది. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నాగర్ కర్నూల్ విద్యార్థులు తందానే తందానే తందానే, చూశారా ఏ చోటైన ఇలాంటి అందాన్ని పెహల్ గావ్ అందాలు మరియు సైనికుల కష్టాల గురించి అనే కలత్మక ప్రదర్శనను అందించారు. భారత ఆర్మీ జవాన్ల సాహసోపేతమైన చర్యలను తమ వేష భాష నృత్యాలతో ప్రదర్శించి ఆహుతులను కట్టిపడేసిన ప్రదర్శనకు రెండో బహుమతి ప్రధానం చేశారు. నాగర్ కర్నూల్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినీలు సమైఖ్య భారతం సమగ్ర భారతం అనే గేయానికి భారతదేశ కళలను ప్రతిభంభించేలా అందించిన నృత్య ప్రదర్శనకు మూడో బహుమతి ప్రధానం చేశారు. కేకే రెడ్డి తెలకపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు,నమో నమో నమో నమో నమో భారవతావని అనే పాటకు నృత్య ప్రదర్శన చేసి ఆహుతులను అలరించారు. కల్వకుర్తి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జయహో జయహో జయహో అనే పాటకు నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థుల నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి విద్యార్థుల సంస్కృతిక నృత్యాలు చూపురులను ఆకట్టుకున్నాయి. సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు అందరినీ ముఖ్య అతిథి, జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎస్పీ ఎమ్మెల్యేలు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, మెమొంటోల్లను అందజేశారు.

సంస్కృతిక కార్యక్రమాలు విజయవంతంగా, దేశభక్తిని చాటిన విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలను నిర్వహించేలా చర్యలు తీసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ను ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో మమేకమై ఫోటోలు దిగారు. అదేవిధంగా, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్సును ముఖ్య అతిథి చిన్నారెడ్డి, ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే లతో కలిసి తిలకించారు. ప్రభుత్వ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉద్యోగులకు పోలీస్ అధికారులకు ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగ ప్రశంసా పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ అర్చన, డీఎస్పీలు, జిల్లా అధికారులు, నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటి చైర్మన్ రమణారావు, గ్రంథాలయ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది, చిన్నారులు, ప్రజలు, విద్యార్థులు, యువతి,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వీరుల త్యాగఫలం ఇంకా పూర్తి కాలేదు:మాజీమంత్రి



(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : భారత రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు.ఎందరో వీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.. స్వాతంత్ర్య సాధన లక్ష్యం కోసం జీవితం మొత్తం త్యాగం చేసారని వివరించారు.స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం సాగిందని దేశంలో ఇప్పటికి చాలా వర్గాల ప్రజలు చట్టసభల్లో అడుగు పెట్టలేదు. వారు అడుగుపెట్టిన రోజు అన్ని వర్గాలకు ఉపయోగపడే చట్టాలు వస్తాయి.అంటరాని తనం.. మహిళల పట్ల అత్యాచారాలు...కుల విభేదాలు.. విద్వేషాలు కనిపిస్తున్నాయి.. వీటిని కూకటి వేళ్ళతో సహా పెకిలించాల్సిన అవసరం ఉందన్నారు.కులమతాలకు అతీతంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. విద్య, ఉపాధి, ఆరోగ్యం, రాజ్యాధికారంలో సమన అవకాశాలు కల్పించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు.గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అయిజ హారికకు అరుదైన గౌరవం



గద్వాల, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం గద్వాలలో నిర్వహించిన ప్రత్యేక అవార్డుల ప్రదానోత్సవంలో నర్సింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న హారిక ఉత్తమ ఫ్యాకల్టీగా ఎంపికై ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష చేతుల మీదుగా హారిక ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ప్రత్యేక గౌరవాన్ని అందజేశారు.హారిక అయిజ చేనేత సహకార సంఘం అధ్యక్షులు డాన్ వీరన్న కుమార్తె కావడం విశేషం. ఆమె ఉత్తమ ఫ్యాకల్టీగా ఎంపికై జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల అయిజ చేనేత సహకార సంఘం సభ్యులు, చేనేత కార్మికులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ హారికకు అభినందనలు తెలిపారు. విద్యారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, అయిజ ప్రాంతానికి మరియు తల్లిదండ్రులకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలి అంటూ పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ పతాకానికి అభివాదం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇన్‌చార్జి నిజలింగప్ప, ట్రైనర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు భరోసా



దేవరకద్ర : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ. జూపల్లి కృష్ణారావు , జిల్లా కలెక్టర్ తో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ గారు మాట్లాడుతూ... గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు, కనీసం కుటుంబంలోకి కొత్తగా వచ్చిన కోడలి పేరును కూడా రేషన్ కార్డులో చేర్చుకునే అవకాశం కూడా గత ప్రభుత్వం కల్పించలేదన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో ఎంతోమంది పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 2 లక్షల 79 వేల స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని, పాలమూరు జిల్లా పరిధిలోని దేవరకద్ర నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 63,367 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందులో సుమారు 20 వేల కొత్త రేషన్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు.ఇప్పటికీ రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలకు కూడా కార్డులు అందిస్తామని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మే 31వ తేదీ వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి కూడా నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి శ్రీ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డిలో రాష్ట్రస్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని, దానికి కొనసాగింపుగా మహబూబ్‌నగర్ జిల్లాలో కలెక్టరేట్ వేదికగా ప్రతి నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు లాంఛనంగా స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. త్వరలో మండలాల వారీగా రేషన్ డీలర్లు, లబ్ధిదారులను ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తూ, పూర్తి పారదర్శకతతో ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ. ఉత్తమ్ కుమార్ రెడ్డి కి దేవరకద్ర నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే జియంఆర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రతి బాధితుడికి న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత : ఎస్పీ




వనపర్తి, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఘనంగా నిర్వహించారు ఎస్పీ ఉదయం 8:45 గంటలకు సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, వారి త్యాగాలు, స్ఫూర్తి మనందరికీ ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశం స్వాతంత్ర్యం సాధించిన అనంతరం అనేక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని ఎస్పీ తెలిపారు. దేశ అభివృద్ధిలో శాంతి భద్రతలు అత్యంత కీలకమని, పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించి, వారి సమస్యలను సానుకూలంగా విని, బాధితులకు న్యాయం అందించేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి బాధితుడికి న్యాయం అందించినప్పుడే మన స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, వివిధ భాషలు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతీయులందరూ ఐక్యతతో ముందుకు సాగుతున్నారని ఎస్పీ తెలిపారు. పోలీసు విధులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ, బాలాజీ నాయక్, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ, సునంద, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూర్ సీఐ, శివకుమార్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి జిల్లా ఎస్సైలు, ఆర్ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత భరోసా
పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
ఎంపీ ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీ చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి
రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి







**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 15 :** స్వాతంత్ర్యం అనంతరం దేశం విద్య, వైద్యం, వ్యవసాయం, ఆహార భద్రత, సామాజిక సంక్షేమం తదితర రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన కుటుంబాలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 20 మండలాల్లో 2,77,457 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని, స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అక్షరాస్యత గణనీయంగా పెరిగిందని చిన్నారెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అక్షరాస్యత 64 శాతానికి పైగా చేరుకోవడం రాష్ట్రంలో సాధించిన అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆహార భద్రతతో పాటు పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వరుసగా వచ్చిన ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశాయని తెలిపారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకురావడంలో రేషన్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందించడం వల్ల పేద కుటుంబాలపై కొంత భారం తగ్గుతుందని తెలిపారు. గతంలో బియ్యంతో పాటు నూనె, పప్పు, కారం, ఉప్పు తదితర నిత్యావసర వస్తువులను కూడా రేషన్ దుకాణాల ద్వారా అందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఆహార ధాన్యాల పంపిణీ పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంలో ఎంతో దోహదపడుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా పేద కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్య సేవలు తదితర ప్రయోజనాలను పొందేందుకు ముఖ్యమైన ఆధారంగా ఉపయోగపడుతుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఇంతకాలం రేషన్ కార్డులు పొందలేకపోయిన కుటుంబాలను గుర్తించి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సన్న రకాల వరి సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన సన్న రకాలలో ప్రస్తుతం అధిక సంఖ్యలో రైతులు ఏడు రకాల సన్నాలను సాగు చేస్తున్నారని చెప్పారు. సన్న రకాల ధాన్యాన్ని పండించే రైతులకు ప్రోత్సాహకంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. రానున్న రబీ సీజన్‌లో రైతులు సన్న రకాల సాగుపై దృష్టి సారించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తోందని చిన్నారెడ్డి తెలిపారు. ఒక్కో కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారికి వివిధ ప్రోత్సాహకాలు, సంక్షేమ ప్రయోజనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఉన్నత చదువులు చదివించాలని కోరారు. పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు విద్య, వైద్యం, గృహ వసతి, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

### ఆకలి విలువ తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి ....

నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.... ఆకలి విలువ తెలిసిన ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని, అందుకే పేద ప్రజల ఆకలి తీర్చడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. దేశంలో పేద ప్రజల సంక్షేమానికి ఇంతటి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన కొనియాడారు. గతంలో పేద ప్రజలు ఆకలి చావులతో అల్లాడిన పరిస్థితులను చూశామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సన్న బియ్యం అందించడంతో ప్రతి పేద కుటుంబం రోజుకు మూడు పూటలా గౌరవంగా భోజనం చేసేలా చర్యలు తీసుకుంటోందని ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. పేదల కడుపు నింపడంతో పాటు వారి కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎంపీ వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సహాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోందని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో అనేక సవాళు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంతో ప్రజాపాలన కొనసాగిస్తున్నారని అన్నారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని డాక్టర్ మల్లు రవి తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల సాధికారత, విద్యార్థుల భవిష్యత్తు, ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదల సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ వాటిని అమలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎంపీ డాక్టర్ మల్లు రవి చెప్పారు. సమావేశానికి హాజరైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, రేషన్ ద్వారా అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ పట్ల అభిప్రాయాలు తెలుసుకునేందుకు అందరిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు చాలా సంతోషంగా ఉన్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి తను స్వయంగా తెలియజేస్తానని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి కి రాష్ట్ర ముఖ్యమంత్రి 18 గంటలు కృషి చేస్తున్నారని ఆయనకు ప్రతి ఒక్కరు తోడుగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ సందర్భంగా చెప్పారు.

### సన్న బియ్యంతో పేదలకు ఆహార భద్రత, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాలో రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా సన్న రకం బియ్యాన్ని పంపిణీని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. 2025 ఏప్రిల్ నెల నుంచి నాగర్ కర్నూల్ జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున సన్న రకం బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 2,79,133 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 18,668 ాాఖీూజ, 2,60,437 ఖీూజ, 28 ాూూ్రా కార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ రేషన్ కార్డుల పరిధిలో మొత్తం 5,99,238 మంది సభ్యులకు జిల్లాలోని 552 రేషన్ దుకాణాల ద్వారా సన్న రకం బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత నెలలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల కోటాకు కలిపి మొత్తం 17,144.358 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యాన్ని లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులు అందేలా పౌర సరఫరాల శాఖ అధికారులు, రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. కులగణన, మీ–సేవ కేంద్రాల ద్వారా జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన 42,647 దరఖాస్తులను గ్రామ సభల ద్వారా పరిశీలించి ఆమోదించినట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారుల పరిశీలన అనంతరం 40,765 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యులను అదనంగా చేర్చే ప్రక్రియను కూడా చేపట్టామని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా పాత రేషన్ కార్డుల్లో 1,07,309 మంది కొత్త కుటుంబ సభ్యులను అదనంగా చేర్చినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలలో ఉన్న 552 రేషన్ దుకాణాలకు ద్వారా అందజేసేందుకు జిల్లాకు రెండు లక్షల 77 వేల, 455 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లాలో అందజేయడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

### నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.....

పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు, జిల్లాలో పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా పేద ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతను మెరుగుపరిచే విధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆకాంక్షించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ "రోటి, కపడా, మకాన్" అనే నినాదంతో పేద ప్రజల ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పేద ప్రజలు ప్రతి ఒక్కరూ నాణ్యమైన సన్న బియ్యంతో అన్నం తినాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సన్న బియ్యం అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న చెంచు కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. అర్హులైన చెంచు కుటుంబాలకు అంత్యోదయ అన్నయోజన (AAY) రేషన్ కార్డులు మంజూరు చేసి, వారికి ప్రతి నెలా 34 కిలోల బియ్యం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. చిన్న గ్రామాలకు ప్రత్యేక రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని చిన్న గ్రామాల్లో ప్రజలు రేషన్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సుమారు 150 రేషన్ కార్డులు కలిగిన చిన్న గ్రామానికి కూడా ఒక రేషన్ డీలర్ షాపు ఏర్పాటు చేసే విధంగా నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.రేషన్ సరుకుల పంపిణీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి రేషన్ దుకాణాల ఏర్పాటు, డీలర్ల నియామకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్టాక్ పాయింట్ల వద్ద బియ్యాన్ని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచడం వల్ల నాణ్యత దెబ్బతిని పురుగులు పడుతున్నాయని కొంతమంది లబ్ధిదారులు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా బియ్యం నిల్వ, రవాణా, పంపిణీ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టాక్ పాయింట్ల వద్ద ఎక్కువకాలం బియ్యం నిల్వ ఉండకుండా అవసరమైన మేరకు వేగంగా రేషన్ దుకాణాలకు తరలించి, అక్కడి నుంచి లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బియ్యం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం మాత్రమే అందేలా అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే సన్న బియ్యం పంపిణీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకుల పంపిణీ జరిగేలా ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. కార్యక్రమానికి ముందు, 11 మంది కి కారుణ్య నియామక పత్రాలను అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్,

1) శివ కుమార్ భార్య సుజాత కు పోలీస్ శాఖలో జూనియర్ అసిస్టెంట్
2) ఫయాజ్ ఖాన్ భార్య తయాబా బేగం కు వైద్య ఆరోగ్య శాఖ లో జూనియర్ అసిస్టెంట్ ,
3)టీ. ఈశ్వరయ్య కుమారుడు టి. లింగస్వామి కి మిషన్ భగీరథ శాఖలో జూనియర్ అసిస్టెంట్,
4) పి. కృష్ణయ్య కుమారుడు పి. రమేష్ కు రెవెన్యూ శాఖ లో ఆఫీస్ సబార్డినేట్ ,
5)ఎం డీ ఖాజా మొయినుద్దీన్ కుమారుడు షేక్ నిరంజన్ కు వెటర్నరీ మరియు అనిమల్ హస్బెండరీ లో ఆఫీస్ సబార్డినేట్
6)కె . భుచ్చ రావు కూతురు ధృవిత కు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్
7)కె. రవీందర్ రెడ్డి కూతురు మహతి కి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్
8)జియాయుద్దీన్ కుమారుడు మొహమ్మద్ ఇర్షద్ అయాన్‌కు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్
9)ఎన్. లక్ష్మయ్య కుమారుడు ముచమయ్య కు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్
10)కె. జంగయ్య భార్య సునీత కు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ ,
11) వి. శ్రీనివాసుల కుమారుడు వి. యాదగిరి కి జిల్లా షెడ్యూల్డ్ కులాల డెవలప్మెంట్ శాఖలో కారుణ్య నియామక పత్రాలను అందించారు.

నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాలకు చెందిన తక్కువ మండలానికి ఇద్దరు లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్, రజిత మల్లేష్, అదనపు కలెక్టర్లు బి చేన్నయ్య, దేవ సహాయం, వివిధ శాఖల అధికారులు ఆర్డీవోలు తాసిల్దార్లు డీలర్లు 20 మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సమయం ప్రతినిధి :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబ రాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ హాజరయ్యారు. ముందుగా సీపీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" ఆలపించారు.ఈ సంధర్భం గా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధించి 80 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని సీపీ అన్నారు. అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందినప్పటికీ రాజ్యాంగ వ్యవస్థ, ప్రజా స్వామ్య విలువలు, చట్టాల అమలులో సమస్యల కారణంగా స్థిరత్వాన్ని సాధించలేకపోయాయని, భారతదేశం మాత్రం బలమైన ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థతో 80 ఏళ్లుగా స్థిరంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం సాధించిన ప్రగతికి ప్రతి భారతీయుడు గర్వపడాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక, భౌగోళిక, వాణిజ్య, సాంకేతిక మార్పులు, అంతర్జాతీయ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటూ స్వయం సమృద్ధి దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని సీపీ తెలిపారు. హైదరాబాద్, తెలంగాణ శాస్త్ర, సాంకేతిక, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు.



2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచంలో ఉన్నత స్థానంలో నిలవాలన్నది మన లక్ష్యమని, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమలు, సాంకేతిక రంగం, ఉపాధి అవకాశాలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా అభివృద్ధికి పోలీస్ శాఖ తన వంతు సహకారం అందిస్తుందని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం కల సాకారం అవుతుందని సీపీ అన్నారు. హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఇతర పెట్టుబడులు పెరగాలంటే శాంతిభద్రతలు కీలకమని, ఈ విషయంలో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని సీపీ అన్నారు. ప్రజా కేంద్రిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు సైబరాబాద్ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన నలుగురు పోలీసు సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, మరో 15 మంది పోలీసు సిబ్బందికి సేవా పతకాలను సీపీ అందజేశారు. పతకాలు అందుకున్న వారిని అభినందించి, ఇదే అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చెందిన చిన్నారులకు బహుమతులు అందజేసి, వారితో కలిసి సీపీ డా. ఎం. రమేష్ ఫొటోలు దిగారు. చిన్నారులతో ముచ్చటించి వారికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, ఎస్ఓటి (SOT) డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ ఏడీసీపీలు, ఏసీపీలు, పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం వేళ.. 'బాంధనీ' తలపాగాతో ఆకట్టుకున్న ప్రధాని

మొదటి పేజీ తరువాయి

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ చరిత్రాత్మక ఘట్టంలో ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎరుపు రంగుతో కూడిన సాంప్రదాయ రాజస్థానీ బాంధనీ తలపాగాను ధరించి ఆకట్టుకున్నారు. దీనికి జతగా తెల్లటి కుర్తా, గోధుమ రంగు కలిగిన కోట్‌ను ధరించారు. జేబులో జాతీయ జెండా రంగులతో కూడిన 'పాకెట్ స్క్వేర్'ను ప్రత్యేకంగా అలంకరించుకున్నారు.

బాంధనీ వస్త్ర కళ ప్రత్యేకలు: 'బాంధనీ' అనేది రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన వస్త్ర కళ. చిన్న చిన్న వస్త్రాలను దారంతో కట్టి.. రంగులు అద్దే విధానంలో ఈ డిజైన్లు రూపొందుతాయి. ఆ దారాలు తొలగించిన తర్వాత వస్త్రంపై చుక్కలు, ఆకృతులు కనిపిస్తాయి. రాజస్థానీ సంస్కృతిలో తలపాగా అనేది కేవలం ధరించే వస్త్రం మాత్రమే కాదు. అది ఆత్మగౌరవానికి, గౌరవ మర్యాదలకు చిహ్నంగా భావిస్తారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవం వేళ ప్రధాని మోదీ ధరించే తలపాగాలు ఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 2025లో ఆయన కాషాయ తలపాగా, తెల్లటి కుర్తాతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

# రాష్ట్ర ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది








**వనపర్తి. సమయం ప్రతినిధి. ఆగస్టు 15 :** వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. వనపర్తి జిల్లాలోని 15 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 1,83,013 స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగా 26,465 రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేస్తున్న కృషిని చీఫ్ విప్ ప్రశంసించారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ.2 వేల కోట్ల నిధులు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ఆదర్శ్ సురభి కూడా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం ప్రారంభం కాగా, వనపర్తిలో జిల్లా స్థాయిలో ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలిచిందన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు రైతు భరోసా అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో 1.83 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు బస్సులు అందించి వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళలకు ఆదాయ మార్గాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని వనపర్తిని నిర్మించడమే లక్ష్యమన్నారు. వనపర్తిలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటీ టవర్, ఇందిరా మహిళా శక్తి భవనం మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చదివిన పాఠశాల, కళాశాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వనపర్తిలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. వనపర్తి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోబోతున్న 1.14 కోట్ల మంది లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

**స్మార్ట్ రేషన్ కార్డుతో మరిన్ని వివరాలు తెలుసుకునే అవకాశం: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనపర్తిలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించుకుని, అనంతరం ఆయా మండలాల్లో కార్డుల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.జిల్లావ్యాప్తంగా 1,83,013 మంది లబ్ధిదారులకు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రేషన్ షాపు వివరాలు, లబ్ధిదారులకు అందే రేషన్ వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు.అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల డిఎం ఆంజనేయులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వికలాంగులు, వృద్ధులకు ఉచిత వీల్‌చైర్ల పంపిణీ చేసిన బీజేపీ నాయకులు




మహబూబాబాద్: ఆగస్టు 15 :(వేకువ సమయం ప్రతినిధి):స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ మున్సిపాలిటీ 08వ వార్డు బాబు నాయక్ తండాలో భారతీయ జనతా పార్టీ నాయకులు డా" ధరంసోత్ సీతారాం నాయక్, ఆధ్వర్యంలో, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు సేవ్యా నాయక్ సహకారంతో ఉచిత వీల్‌చైర్ల పంపిణీ సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వృద్ధాప్యం శారీరక అంగవైకల్యం కారణంగా నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాదావత్ శంకర్, భూక్యా వాలి, బానోత్ సోనీ, ఆంగోత్ శ్రీను, ఆంగోత్ కాలి కి ఉచితంగా వీల్‌చైర్లు అందజేశారు.ఈ సందర్భంగా డా" ధరంసోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ,,, వృద్ధాప్యం శారీరక ఇబ్బందుల కారణంగా నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వీల్‌చైర్లు అందించడం ద్వారా వారి రోజువారీ జీవితంలో కొంత సౌలభ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, సేవా కార్యక్రమాల ద్వారా వారి జీవితాల్లో కొంతైనా సౌలభ్యం కల్పించడం మన బాధ్యత, ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని తెలిపారు."సేవే లక్ష్యం -- ప్రజల సంక్షేమమే ధ్యేయం" అనే సంకల్పంతో ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సాధ్యమైనంత సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని డా" సీతారాం నాయక్ తెలిపారు.ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా యాజమాన్యానికి డా" సీతారాం నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## లంకాల లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

నారాయణపేట :నారాయణపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక ఆధ్వర్యంలో నర్వ మండలంలోని లంకాల గ్రామ లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు నూతన డిజిటల్ రేషన్ కార్డులు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ , మండల ఉపాధ్యక్షులు శరణప్ప,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగన్న వివేకవర్ధన్ రెడ్డి, మండల నాయకులు , వివిధ గ్రామాల సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యం... ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలే అండ! కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం - ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## ఆరవింద్.. నీచపు రాజకీయాలు మానుకో




సమయం ప్రతినిధి, నల్లగొండ: ఆరవింద్ నీచపు రాజకీయ చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలియదా అని బీర్ల అయిలయ్య ప్రశ్నించారు.జనగామ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ఆరవింద్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు.ఒక బీసీ నాయకుడిపై సభ్యత, సంస్కారం లేకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. "మీ నానమ్మ బీడీలు చేసి మిమ్మల్ని సాదిందని మీ నాన్న డీఎస్ ఇంటర్వ్యూలో చెప్పారని,అలాంటి కుటుంబం నుంచి వచ్చిన వారు నేడు వేల కోట్ల రూపాయల అధిపతులు ఎలా అయ్యారని,కోట్ల రూపాయల అద్దెలు వచ్చే ఆస్తులు ఎలా సంపాదింరని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, అనంతరం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం ఆరవింద్ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. గతంలో డీఎస్ పీసీసీ అధ్యక్షులుగా ఉన్న సమయంలో బీ–ఫామ్‌లకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొన్న చరిత్ర కాంగ్రెస్ నాయకులకు తెలుసన్నారు.నిజామాబాద్ ప్రాంతానికి చెందిన బీసీ నాయకుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, అదే ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధిగా ఉన్న ఆరవింద్ ఆయనను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో డీఎస్ నిజామాబాద్ నుంచి పీసీసీ అధ్యక్షులుగా పనిచేశారని, ప్రస్తుతం అదే ప్రాంతానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి నాయకులను రాజకీయాలకు అతీతంగా గౌరవించడం విజ్ఞతకు నిదర్శనమన్నారు.హిందూ సంస్కృతి, సంప్రదాయాల గురించి మాట్లాడే బీజేపీ నాయకులు వ్యక్తిగత దూషణలతో కూడిన రాజకీయాలను ప్రోత్సహించడం ఏ సంస్కారమని ప్రశ్నించారు.తాము కూడా వారి లాగా వ్యక్తిగతంగా మాట్లాడితే బీజేపీ నాయకులు రోడ్ల మీద తిరగగలరా అని అన్నారు.అహంకారం నెత్తికెక్కి ఇష్టానుసారంగా మాట్లాడితే రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో చరిత్రను పరిశీలించాలని బీర్ల సూచించారు. అహంకారంతో వ్యవహరించిన అనేక మంది నాయకులు, నియంతలు చివరకు ప్రజల తిరస్కారానికి గురైన విషయాన్ని గుర్తు చేశారు.పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారిపై చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు ఎంపీ ఆరవింద్ వెంటనే క్షమాపణ చెప్పాలని బీర్ల డిమాండ్ చేశారు.

## పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



భూత్పూర్: (సమయం ప్రతినిధి) దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీ వెంకట్ నారాయణ పదవీ విరమణ పొందిన సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే శ్రీ ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ ఉపాధ్యాయుడిగా ఎన్నో సంవత్సరాలు అందించిన సేవలను ఆల వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆయన సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.

## పిగ్లీపురంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అబ్దుల్లాపూర్‌మెట్: (సమయం ప్రతినిధి) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పిగ్లీపురం గ్రామపంచాయతీ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుర్గం నరసింహ యాదవ్, వార్డు సభ్యులు, దేవస్థానం కమిటీ సభ్యులు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొర్లపాడు మోడల్ స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం

### ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యేక సన్మానం



వేకువ సమయం, నకిరేకల్: కొర్లపాడు మోడల్ స్కూల్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా, దేశభక్తి పూరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్వహించిన ఈ వేడుకల్లో ఒక వినూత్న, అభినందనీయ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల చదువుకు పరోక్షంగా తోడ్పడుతూ సమాజానికి సేవలందిస్తున్న స్థానిక ఆర్టీసీ డ్రైవర్ కుమార్, కండక్టర్ బాధిని గౌతమిలను పాఠశాల యాజమాన్యం వేదికపై ఘనంగా సన్మానించింది. ప్రతిరోజూ ఎండనక, వాననక విద్యార్థులను ఎంతో సురక్షితంగా పాఠశాలకు చేరవేస్తూ, వారి క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసానికి సహకరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది సేవలను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొనియాడారు. డ్రైవర్ కుమార్, కండక్టర్ గౌతమిలకు పాఠశాల తరఫున శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. "సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమైనదే. ప్రతిరోజూ మన పిల్లలను సురక్షితంగా స్కూలుకు చేరవేస్తున్న ఆర్టీసీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి. ఈ స్వాతంత్ర దినోత్సవ వేళ వారిని గౌరవించుకోవడం మన బాధ్యత" అని పాఠశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆర్టీసీ సిబ్బందిని సన్మానించిన పాఠశాల యాజమాన్యం చొరవను స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు విశేషంగా అభినందించారు.



# శాసన సభలో చర్చిద్దాం..రా..
# కేసీఆర్ కు సీఎం రేవంత్ సవాల్

హైదరాబాద్, సమయం ప్రతినిధి: తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. ఈ రోజు (శనివారం) సంగారెడ్డిలో పర్యటించిన రేవంత్ రెడ్డి.. నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు.. రెండూ ఒక్కటే. గతంలో ఆ పార్టీలు ఎప్పుడైనా సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచించాయా?. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయి. రైతులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా?. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం. ఐదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటా. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు.

## దివంగత ఎమ్మెల్యే ఎమ్మెల్సీకి ఎంపీ అరుణ, మాజీ ఎమ్మెల్యే ఘన నివాళులు

**(సమయం ప్రతినిధి నారాయణపేట) :** దివంగత మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్సీ చిట్టెం నర్సిరెడ్డి వర్ధంతి సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి,ఎంపీ డీకే అరుణ ఘన నివాళులు అర్పించారు.అనంతరం చిట్టెం నర్సిరెడ్డి ( ఘాట్) స్మారక స్థలం వద్ద పుష్పాంజలి ఘటించారు. ప్రజా నాయకుడు చిట్టెం నర్సిరెడ్డి నారాయణపేట జిల్లాకు అందించిన సేవలు ఎంపీ డీకే అరుణ కొనియాడారు.చిట్టెం నర్సిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకునేందుకు భారీగా అభిమానులు,కార్యకర్తలు,వివిధ పార్టీల నాయకులు తరలివచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం, ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు,తుది శ్వాస వరకు కృషి చేసిన నాయకుడు తన తండ్రి చిట్టెం నర్సిరెడ్డి ని నక్సలైట్ల కాల్పులలో కోల్పోవడం తమ కుటుంబానికి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అని అన్నారు.తన తండ్రి చిట్టెం నర్సిరెడ్డి సుదీర్ఘ ప్రజా జీవితంలో ప్రజలకు అందించిన సేవలను, ఈ ప్రాంత ప్రజలతో ఆయన పెనవేసుకున్న అనుబంధం స్మరించుకున్నారు. చిట్టెం నర్సిరెడ్డి ఆశయ సాధనలోనే నిరంతరం ముందుకు సాగుతానని ఎంపీ డీకే అరుణ అన్నారు.

**నక్సల్స్ కాల్పులు :** 2005 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రజా నాయకుడు చిట్టెం నర్సిరెడ్డి నక్సలైట్ల కాల్పులలో దారుణంగా హత్యకు గురయ్యారు. చిట్టెం నర్సిరెడ్డి మక్తల్ నియోజకవర్గం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా ప్రజాసేవ చేసి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

**రాజకీయ ప్రస్థానం:** చిట్టెం నర్సిరెడ్డి గారు అతిపిన్న వయస్సులోనే తన 22వ ఏటా ధన్వాడ గ్రామ సర్పంచ్ గా ఎన్నికయ్యారు.నాటి ప్రధాని నెహ్రూ గారిని మన్ననాలు పొందిన సర్పంచ్ గా అభినందన పత్రాన్ని సైతం అందుకున్నారు.ఆ తర్వాత సమితి ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. అనంతరం జజదీ చైర్మన్గా ఎన్నికయ్యారు. 1971-76లో తొలిసారిగా శాసన మండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1977-83 రెండవ సారి ఎమ్మెల్సీ అయ్యారు, 84-89 జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యే,89-94 జనతా దళ్ పార్టీ నుంచి రెండవ సారి ఎమ్మెల్యే గెలుపొందారు. అనంతరం 2004లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. సర్పంచ్ నుంచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అంచలంచెలుగా వివిధ హోదాల్లో పనిచేశారు.

**కాల్పుల కలకలం:** 2005 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి గారిని పై నక్సలైట్లు కాల్పులు జరిపి హత్య చేశారు. నక్సలైట్ల దాడిలో చిట్టెం నర్సిరెడ్డి తో పాటు ఆయన కుమారుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డితో సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

**స్వాతంత్ర్య వేడుకల వేళ ఉలిక్కి పడ్డ రాష్ట్రం:** నారాయణపేట జిల్లాలోని నాటి సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాలలో 2005 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ముగిసిన అనంతరం నారాయణపేటలోని పల్లా ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి గారు మధ్యాహ్నం 1:15 నిలుషాలకు మావోయిస్టులు (ఒక మహిళ,ఇద్దరు పురుషులు) ఎమ్మెల్యే నర్సిరెడ్డి గారితో పాటు ఆయన కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డి లతో పాటు మరికొందరు పై కాల్పులు జరుపగా.. దాడిలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మావోయిస్టుల కాల్పుల్లో చనిపోయిన వారిలో ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, ఆయన కుమారుడు చిట్టెం వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు, RDO అటెండర్, ఎమ్మెల్యే నర్సిరెడ్డి గన్ మెన్ రాజిరెడ్డి,ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు కార్యకర్తలు, మరో ఇద్దరు అనుచరులు ప్రాణాలు కోల్పోగా.. కాల్పులలో గాయపడిన RDO శివారెడ్డి,సూర్యలక్ష్మి కాలేజ్ ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, చిట్టెం నర్సిరెడ్డి గారి అనుచరులు ఏడుగురికి బుల్లెట్లు తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు.

## టీటీడబ్ల్యుయూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ నాగేంద్రమ్మకు ప్రతిష్టాత్మక అవార్డు



మహబూబాబాద్: (సమయం ప్రతినిధి) : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సుఖభోగి నాగేంద్రమ్మకు విశిష్ట సేవలకు గాను ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. గత ఏడాది కళాశాలలో ఇంటర్మీడియట్ 100 శాతం ఫలితాలు సాధించడంతో పాటు ఓ విద్యార్థినికి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు, పలువురు విద్యార్థులకు ఎంసెట్, నీట్‌లో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేసినందుకు ఈ గుర్తింపు దక్కింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ శబరీష్, ఎమ్మెల్యే మురళీనాయక్ చేతుల మీదుగా నాగేంద్రమ్మ అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ వారి విద్య, సంక్షేమానికి కృషి చేస్తున్న ఆమెకు అవార్డు రావడం పట్ల కళాశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## జీహెచ్ఎంసీ పరిధిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



హైదరాబాద్: (సమయం ప్రతినిధి) : హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఐఏఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




మహబూబ్‌నగర్: (సమయం ప్రతినిధి) : మహబూబ్‌నగర్ సైన్స్ మ్యూజియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మ్యూజియంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ సైన్స్ మ్యూజియం సందర్శించడం ద్వారా విద్యార్థుల్లో అన్వేషణ సామర్థ్యం, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మ్యూజియాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి జిల్లాలోని విద్యార్థులందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.డి. శంషీర్ మాట్లాడుతూ సైన్స్ మ్యూజియం ప్రాంగణంలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటుకు సీజీఆర్ సంస్థకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దయాకర్, శరత్‌కృష్ణ, వెంకటయ్య, రెహమాన్, నాగమనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకంగా రేషన్ పంపిణీ

మహబూబ్‌నగర్: (సమయం ప్రతినిధి) : స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరిగి, అవినీతికి అడ్డుకట్ట పడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల స్మార్ట్ కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 2,79,523 రేషన్ కార్డులు ఉండగా, 9,61,377 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు స్మార్ట్ కార్డులతో సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 63,367 రేషన్ కార్డులు ఉండగా, సుమారు 20 వేల కొత్త కార్డులు ఉన్నాయని తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను మొబైల్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో




అదనపు కలెక్టర్లు జె.ఎల్.బి. హరిప్రియ, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీ వాణి హై స్కూల్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆత్మకూరు : 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్లో శనివారం నాడు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగాపాఠశాల స్కౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థుల పరేడ్ మరియు విద్యార్థుల ఉపన్యాసాలు, సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేటి 80వ.స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లతా మరియు గంగాధర్ మరియు అంజనీ గార్లు మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి వందనం సమర్పించి, జాతీయ జెండాను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. తదనంతరం విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఉపన్యాస, నృత్య ప్రదర్శన, దేశభక్తి గీతాలు నిర్వహించారు.మరియు చిన్నారి విద్యార్థులకు మహనీయుల వేషధారణలు వేయించారు. అలాగే పాఠశాలలోని స్కౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థుల చేత పరేడ్ చేయించి,స్వాతంత్ర్య సమరయోధులకు వందనం సమర్పించారు. అలాగే యూనిట్ టెస్ట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావడానికి ప్రయత్నం చేసిన మహనీయులు ఎందరో ఉన్నారు. ఆ త్యాగధనులను స్మరించుకుంటూ,వారందరికీ జోహార్లు తెలియజేద్దాం.భారతదేశాన్ని బ్రిటీష్ వారు క్రమక్రమంగా




ఆక్రమించుకుంటూ భారతీయులను బానిసలుగా చూశారు. అలాంటి బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయం ఈ మన స్వాతంత్ర్య దినోత్సవం. మన పాఠశాలలో గత సంవత్సరంలో జిల్లా ఉత్తమ మార్కులు వచ్చాయని,ఇప్పుడు కూడా మంచి మార్కులు వచ్చేలా విద్యార్థులు చదవాలని, రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా మార్కులు ఉండాలని, దానికి విద్యార్థులందరూ ప్రయత్నం చేయాలని వారు తెలియజేశారు.స్వాతంత్ర్య సమరయోధుల పోరాట బలం,అమర వీరుల త్యాగఫలం ఈ స్వాతంత్ర్యం అని తెలియజేస్తూ అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బీఆర్ఎస్ నాయకుడు కాకునూరు శంకరయ్య మృతి బాధాకరం

కేశంపేట: (సమయం ప్రతినిధి): కేశంపేట మండలం అల్వాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాకునూరు శంకరయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన శంకరయ్య స్వగ్రామానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ శంకరయ్య మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని, మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో తిర్మల్రెడ్డి శ్రీనివాసులు, నాయకులు సుధాకర్, కృష్ణయ్య, రాజు, మద్దూరి మల్లేష్, రాజేందర్, మహేష్, యాదయ్య, ఆలూరి రాజు, అంజయ్య, కె. మల్లేష్ తదితరులు నివాళులర్పించారు.

## యాచారంలో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ



యాచారం: (సమయం ప్రతినిధి) : యాచారం మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు జారుప్ల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా, జిల్లా కార్యదర్శి కొండ మధుకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నాగరాజు కొండాపురం, సందీప్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పి. నరేష్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకానికి గౌరవం తెలిపి దేశభక్తిని చాటారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085